డెంగీతో ఒకరి మృతి

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 1: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టెక్రియాల్ గ్రామానికి చెందిన సుజిత్(16) అనే యువకుడు డెంగీతో ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గత పది రోజుల క్రితం తీవ్ర జ్వరానికి గురైన సుజిత్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.


అలుగుదూకుతున్న పోచారం ప్రాజెక్టు


ఉధృతంగా పారుతున్న కామారెడ్డి పెద్ద చెరువు


కళ్యాణి ప్రాజెక్టు నాలుగు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

జిల్లాలో.. కుండపోత!

కామారెడ్డి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి)/ కామారెడ్డి టౌన్: జిల్లాలో కుండపోత వర్షం కురుస్తోంది. గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తునే ఉన్నాయి. వర్షాల తాకిడికి జనజీవనం సైతం స్తంభించిపోతోంది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 102.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో పది మండల్లాలో కుండపోత వర్షం కురిసింది. అత్యధికంగా భిక్కనూర్‌లో 194.5 మి.మీల వర్షం కురువగా అత్యల్పంగా జుక్కల్‌లో 35.2 మి.మీల వర్షం పడింది. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో పలుచోట్ల రహదారులు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. భారీ వృక్షాలు కూలి రోడ్డుపై పడిపోతున్నాయి. మరికొన్నిచోట్ల శిథిల భవనాలు కూలిపోయాయి. వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్ట్‌లోకి వరద పోటెత్తుతోంది. కళ్యాణి రిజర్వాయర్ పూర్తిగా నిండుకోవడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

పది మండల్లాలో అతిభారీ వర్షాలు

జిల్లాలోని పది మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా భిక్కనూరులో 194.5 మి.మీల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా జుక్కల్‌లో 35.2 మి.మీల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాకాలం సీజన్‌లో ఏకంగా పది మండలాల్లో కుండపోత వర్షం కురువడం ఇదే మొదటిసారి. బాన్సువాడలో 185.3 మి.మీ వర్షం కురువగా, కామారెడ్డిలో 174.6 మి.మీ, సదాశివనగర్‌లో 189.0మి.మీ, దోమకొండ 150.9 మి.మీ, తాడ్వాయిలో 150.5 మి.మీ, నస్రూల్లాబాద్ 134.2 మి.మీ, రాజంపేటలో 131.5 మి.మీ, రామారెడ్డిలో 107.4 మి.మీ, పల్వంచలో 106.8 మి.మీ, లింగంపేటలో 94.5 మి.మీ, ఎల్లారెడ్డిలో 93.3 మి.మీ, గాంధారిలో 84.0 మి.మీ, పిట్లం 74.0 మి.మీ, మద్నూర్‌లో 42.2 మి.మీ, పెద్దకొడప్‌గల్‌లో 46.1 మి.మీ, బిచ్కుందలో 44.5 మి.మీ, బీర్కూర్‌లో 58.8 మి.మీ, నిజాంసాగర్‌లో 81.1 మి.మీ, నాగిరెడ్డిపేటలో 84.8 మి.మీ, బీబీపేటలో 40.2 మి.మీ, మాచారెడ్డిలో 44.0 మి.మీ, డోంగ్లిలో 42.3 మి.మీల వర్షం కురిసింది.

కామారెడ్డిని ముంచెత్తిన వరద

కామారెడ్డిని వరద ముంచెత్తింది. పెద్దచెరువు ఉధృతంగా ప్రవహిస్తూ అలుగు దూకుతోంది. భారీ వర్షాలతో పట్టణంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. కాలనీల్లోకి వరద పోటెత్తింది. టీచర్స్ కాలనీ, పంచముఖి హనుమాన్ కాలనీ, గాంధీనగర్, వాసవికాలనీలు చెరువులను తలపించాయి. ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నిజాంసాగర్ రోడ్డు, జన్మభూమి రోడ్డు తదితర కాలనీలు ఎప్పటిలాగే నీట మునిగాయి. వరద ముంచెత్తడంతో సిరిసిల్లా రోడ్డు ఎప్పుడు లేనంతగా చిన్నపాటి చెరువును తలపించింది. వాసవికాలనీ పూర్తిగా జలమయమైంది. రామారెడ్డి రోడ్డు వరద నీటితో నిండిపోవడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. పట్టణ శివారులోని టెక్రియాల్ వద్ద జాతీయ రహదారిపై వేస్తున్న సర్వీస్ రోడ్డు కల్వర్టు వరద నీటిని కుంగిపోయింది.

తెగిపోతున్న రహదారులు.. కూలుతున్న వృక్షాలు

జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగుల్లో వరద పోటెత్తుతోంది. దీంతో పలు ప్రాంతాల్లో వరద తాకిడికి రహదారులు తెగిపోతున్నాయి. చెరువులకు గండ్లు పడుతున్నాయి. ఈదురుగాలులకు భారీ వృక్షాలు కూలి రోడ్లకు అడ్డంగా పడిపోతున్నాయి. దోమకొండ మండలం లింగుపల్లి ప్రధాన రహదారిపై భారీ వృక్షం కులిపోవడంతో దోమకొండ, కామారెడ్డి ప్రాంతాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలీసులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. బీబీపేట మండలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దోమకొండ, గొట్టిముక్కుల వైపు వెళ్లే ప్రధాన రహదారిపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపివేశారు. రాజంపేట మండలంలోని వరద ఉధృతి తాకిడికి మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. సదాశివనగర్ మండలంలో అమర్లబండ వాగు ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తోంది. భిక్కనూరు మండలం ఎడ్లకట్టవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. గాంధారి మండలంలో ప్రధాన రహదారిపై వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎల్లారెడ్డి మండలం కళ్యాణివాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిపివేశారు. రాజంపేట నుంచి శివాయిపల్లి వెళ్లే హర్యాల వాగు ఉధృతంగా ప్రవహించడంతో రహదారుల గుండా రాకపోకలు నిలిపివేశారు.

- జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం
- 10 మండలాల్లో కుండపోత వర్షం
- అత్యధికంగా భిక్కనూరులో 194.5 మి.మీల వర్షపాతం నమోదు
- అత్యల్పంగా జుక్కల్‌లో 35.2 మి.మీల వర్షపాతం
- జిల్లా వ్యాప్తంగా 102.8 మి.మీల వర్షపాతం
- భారీ వర్షాలకు విద్యాసంస్థలకు సెలవులు
- అలుగు పారుతున్న పోచారం ప్రాజెక్టు, కామారెడ్డి పెద్ద చెరువు
- పోచారం, కళ్యాణి గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- నిజాంసాగర్, కౌలాస్‌నాలా ప్రాజెక్టులోకి భారీగా వస్తున్న వరద
- భారీ వర్షాలకు తెగిపోతున్న రహదారులు.. కూలుతున్న భారీ వృక్షాలు
- గుడితండా ప్రభుత్వ పాఠశాల కూలిన గోడ
- సంగమేశ్వర్ వాగులో చిక్కుకున్న గేదెలను కాపాడిన రైతులు

వాగులు, చెరువులకు జలకళ

గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని పలు చెరువులు, వాగులకు జలకళ సంతరించుకుంటుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కామారెడ్డి పెద్దచెరువులోకి భారీ వరద వస్తుండడంతో అలుగు దూకుతోంది. లింగంపేట పెద్దవాగుకు వరద పోటెత్తుతోంది. ఈ వాగు వరద ఉధృతితో ప్రవహిస్తోంది. మాచారెడ్డిలోని పల్వంచవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అదేవిధంగా తాడ్వాయి, కామారెడ్డి, భిక్కనూర్, దోమకొండ, బీబీపేట, గాంధారి, సదాశివనగర్, మాచారెడ్డి, రామారెడ్డి, రాజంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి తదితర మండలాల పరిధిలోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా వచ్చి చేరుతోంది. దీంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి.

ప్రాజెక్టుల్లోకి పోటెత్తుతున్న వరద

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన ప్రాజెక్టులోకి వరద పోటెత్తుతోంది. గత వారం రోజుల కిందట నీరులేక బోసిపోయిన నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్ట్‌లతో పాటు కళ్యాణి, సింగీతం రిజర్వాయర్‌లకు వరద ప్రవాహం వచ్చి చేరడంతో నిండుకుండలా కనిపిస్తున్నాయి. భారీ వర్షాలతో నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో ప్రాజెక్టు అలుగు దూకుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.778 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్‌లోకి 30,780 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి సైతం భారీగా వరద వస్తోంది. ప్రాజెక్ట్‌లోకి 15,600ల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.200ల టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. కౌలాస్ ప్రాజెక్ట్‌లోకి సైతం వరద వస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లోకి 1470 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 0.627 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.237 టీఎంసీలు. కాగా కళ్యాణి ప్రాజెక్టు నాలుగు గేట్లను ఎత్తి 6,150 క్యూసెక్కుల నీటిని మంజీరాలోకి, 150 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ ఏఈఈ శివకుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 409.50 మీటర్లకు గాను ప్రస్తుతం 409.50 మీటర్ల నీరు నిల్వ ఉందని తెలిపారు.


రాజంపేటలో పాఠశాల గోడ కూలిన దృశ్యం


సంగమేశ్వర్ వాగులో చిక్కుకున్న గేదెలు


కామారెడ్డి శివారులో కుంగిన జాతీయ రహదారి


నిజాంసాగర్‌లో పెరుగుతున్న నీటి సామర్థ్యం


సింగీతం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

నేడు పొలాల అమావాస్య


బసవన్నల అలంకరణ సామగ్రిని కొనుగోలు చేస్తున్న రైతులు

మద్నూర్, సెప్టెంబరు 1 : మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దున ఉన్నటు వంటి గ్రామాల్లో పొలాల అమావాస్య పండుగను అనవాయితీగా జరుపుకుంటారు. ఈ పండుగను శ్రావణ మాసంలో వచ్చే చివరి అమావాస్య రోజున జరుపుకోవడం అనవాయితీ. సోమవారం పొలాల అమావాస్య పండుగను జరుపుకోవడానికి రైతులు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గానికి దగ్గరలో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు ఉండటంతో ఈ ప్రాంతం రైతులు ఎడ్ల పొలాల అమావాస్య పండుగ జరుపుకునే ఆనావాయితీ ఉంది. ఆరుగాలం కష్టపడి అహర్నిశలు పంటలు పండిస్తూ దేశానికి అన్నదాతలుగా నిలుస్తున్న రైతులు ఈ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. రైతులు పరోపకారులు తమకు మేలు చేసి ఏ ఒక్కరిని మర్చిపోకుండా మనుషులైన మూగ జీవాలైన రైతుల ప్రేమలో మార్పు కనిపించదు. పొలాల అమావాస్య ఏడాదికోసారి శ్రావణమాసంలో అమావాస్య రోజున వచ్చే పొలాల అమావాస్య పండుగ. పండుగకు ఒకరోజు ముందు తమ నేస్తాలైన ఎడ్లతో ఎలాంటి పనులు చేయించకుండా వాటికి కావాల్సిన మేతతో పాటు బెల్లం, పటిక పదార్థాలను తాగించి సంతోషంగా ఉంచుతారు. పండుగ రోజు ఉదయాన్నే తమ వద్ద ఉన్న పశువులన్నింటినీ వాగుల్లో, చెరువుల్లో, లేదంటే ఇంటి వద్దనే వాటికి స్నానం చేయిస్తారు. ఆ తరువాత సాయంత్రం ఎద్దులకు జోళ్లు (బాసింగాలు), నెమలి పించాలు, కాళ్లకు గజ్జలు, మెడలో గంటలు వాటితో అందంగా అలంకరిస్తారు. అలా అలంకరించిన వాటిని ఊరు చివర్లో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం చుట్టూ బసవన్నలతో ప్రదక్షిణలు చేయించి ఆ తరువాత ఇంటికి వెళ్లే ముందు గ్రామ సేవకుడు కట్టిన తోరణాన్ని తొలగించే కార్యక్రమం నిర్వహిస్తారు. ఆ తరువాత గ్రామంలోకి అడుగు పెట్టి రైతులు తమ ఇంటికి వచ్చిన ఆడబిడ్డల చేతుల మీదుగా గోమాతలకు బసవన్నలకు కలిపి వివాహాన్ని నిర్వహిస్తారు. వాటికి తమలపాకులతో నైవేద్యం పెట్టి తినిపిస్తారు. ఆ తరువాత తమ చుట్టుపక్కల బంధు, మిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకుంటారు.

గ్రామీణ ప్రాంతాల్లో సందడి

గ్రామీణ ప్రాంతాల్లో పొలాల అమావాస్య పండుగను పురస్కరించుకుని పండుగ వాతావరణం మార్కెట్‌లో పశువులను అలంకరించడానికి సామగ్రిని విక్రయిస్తుండడంతో సందడిగా కనిపిస్తోంది.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నాగమడుగును పరిశీలించిన కలెక్టర్
- అధికారులు అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్, సెప్టెంబరు 1: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఆదివారం నిజాంసాగర్ మండలంలోని నాగమడుగు లోలెవల్ బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పరిశీలించారు. నిజాంసాగర్ మండల పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా ఉండే విధంగా అధికారులు ముందస్తుగానే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నాగమడుగు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా నాగమడుగు ఎగువ భాగంలో గల అచ్చంపేట ఇతర గ్రామాల ప్రజలు రాకపోకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ భిక్షపతిని ఆదేశించారు. పురాతనమైన ఇళ్లలో నివసిస్తున్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయన వెంట మండల తహసీల్దార్ భిక్షపతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందూరి అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ సాయిరాం తదితరులు ఉన్నారు.

లింగంపేట: లింగంపేటలోని పెద్దవాగు పొంగి పొర్లుతోంది. నాగారం వద్ద బ్రిడ్జి మునిగిపోయింది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నాగారం బ్రిడ్జిని పరిశీలించారు. కోర్పోల్, నాగారం గ్రామాల ప్రజలు ఈ దారిగుండా లింగంపేటకు రావద్దని దారిని మూయించారు. మండ లంలోని మెంగారం, బోనాల్, భవానిపేటలతో పాటు పలు గ్రామాలలో పంటలు మునిగిపోయాయి. మండల కేంద్రంలో రెండు ఇండ్లు కూలిపోయాయి. మండలంలోని అయిలాపూర్ కాలనీలో ఇండ్లలోకి నీరు చేరింది. వరద ఉధృతికి మండలంలోని మోతె బట్టిప్పగడ్డ తండాలో రాకపోకలు నిలిచిపోయాయి. అయిలాపూర్-రాంపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి, అయిలాపూర్ చెరువు నిండి అలుగు పారుతుండడంతో లింగంపేట అయిలాపూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి, మండలంలోని పలు గ్రామాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.


నాగమడుగు వద్ద మంజీరా నదిని పరిశీలిస్తున్న కలెక్టర్


నాగారం వద్ద పెద్దవాగు బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్


పెద్దవాగు వరద ఉధృతికి మునిగిన నాగారం బ్రిడ్జి


ఐలాపూర్ చెరువు అలుగు ఉధృతికి నిలిచిపోయిన రాకపోకలు


సమావేశంలో మాట్లాడుతున్న కాసాని వీరేశ్

'ముదిరాజ్‌లను బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలి'

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 1: ముదిరాజ్‌లను బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, అప్పుడు ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని ముదిరాజ్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు కరాటే రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లంతా ఏకమై జిల్లా మహాసభను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి రాబోయే ఎన్నికల్లో సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా గెలుపొందే విధంగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా రానున్న రోజుల్లో ముదిరాజ్‌లే రాజకీయ పాలన చేయాలని, ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. పార్టీలకు అతీతంగా ముదిరాజ్‌లంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాజారాం, వినోద్, జక్కం అశోక్ పాల్గొన్నారు.

మంచిప్ప చెరువులో భారీ చేప లభ్యం

మోపాల్, సెప్టెంబరు 1: మండలంలోని మంచిప్ప చెరువులో మత్స్యకారులకు భారీ చేప లభించింది. ఆదివారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువు అలుగు పారింది. మత్స్యకారులు వలలు వేయడంతో అందులో 20కిలోలకు పైగా బరువు ఉన్న రవాట చేప లభ్యమైంది. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడు ఇంత పెద్ద చేప లభించలేదని ఇదే మొదటిసారి అని వారు సంతోషం వ్యక్తం చేశారు.


భారీ చేపతో మత్స్యకారులు

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 1: సెప్టెంబరు 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పూలాంగ్ చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహానికి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని పదవీ విరమణ తర్వాత ఉద్యోగి కుటుంబం రోడ్డుపైకి వచ్చే పరిస్థితి ఉందన్నారు. అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని తెలిపారు. అదేవిధంగా మన రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఆ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, శంకర్, సంజీవ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భార్యను హత్యచేసిన వ్యక్తి రిమాండ్


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

డిచ్‌పల్లి,సెప్టెంబరు 1: డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఈ నెల 29న రాథోడ్ విజయను భర్త అయిన గబ్బర్ సింగ్ చితకబాది చున్నీతో గొంతుకు కట్టి ఫ్యాన్‌కు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించిన గబ్బర్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. గబ్బర్ సింగ్‌కు తన భార్య విజయ వేరే వాళ్లతో ఫోన్‌లో మాట్లాడుతున్నదని అనుమానం పెంచుకొని భార్యను హత్య చేసినట్లు విచారణ ఒప్పుకున్నడని డిచ్‌పల్లి సీఐ తెలిపారు. కాగ మృతురాలిది సదాశివనగర్ మండలం యాచారం అని వెస్లీనగర్ తండాకు చెందిన గబ్బర్ సింగ్‌తో 2016లో రెండో వివాహం అయిందని సీఐ పేర్కొన్నారు.

బూత్ స్థాయి కార్యక్రమాలను విజయవంతం చేయాలి

పెద్దబజార్, సెప్టెంబరు 1:నెలరోజుల పాటు కొనసాగుతున్న సభ్యత్వ నమోదులో బూత్ స్థాయి కార్యకర్త నుంచి నాయకుల వరకు పాల్గొని విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్నాటి కార్తిక్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని అన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అతిపెద్ద పార్టీగా అత్యధిక సభ్యత్వం గల బీజేపీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోనే జిల్లాను సభ్యత్వ నమోదులో ముందుంచాలని పిలుపునిచ్చారు.

పడిగెలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పడిగెల పాఠశాలలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

వేల్పూర్, సెప్టెంబరు 1: మండలంలోని పడిగెల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యసంవత్సరం పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు గత 12ఏళ్ల తర్వాత ఒక చోట చేరి గెట్టుగేదర్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయాప్రాంతాల్లో వివిధ వృత్తులు, వ్యాపారులు, ఉద్యోగులుగా స్థిరపడిన పూర్వవిద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని అనిల్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనాటి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు.అనాటి తరగతి గదుల్లో చిలిపి చేష్టలు, అలర్లు, వివిధ సబ్జెక్టులపై బోదించిన వేసుకున్న జోక్‌లు, ఇతర మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కుటుంబసభ్యులతో కలిసి ఉల్లాసంగా ఆత్మీయంగా ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్‌రావు, అశోక్, లింబాద్రి, గంగాధర్, లక్ష్మీనారాయణ, గంగామోహన్, గంగనర్సయ్య, రాజేందర్‌గౌడ్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎడ్ల పొలాల అమావాస్య


నగరంలో మట్టి ఎడ్లను కొనుగోలు చేస్తున్న దృశ్యం


నాళేశ్వర్‌లో పొలాల అమావాస్య నిర్వహిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 1: సంతానాన్ని, ఆయుష్షుని అందించే వ్రతంగా ఎడ్ల పొలాల అమావాస్యను జరుపుకుంటారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎడ్ల పొలాల అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రైతులు వ్యవసాయంలో తమకు దన్నుగా నిలిచిన ఎడ్లను నీటితో స్నానం ఆచరించి కొత్త వస్త్రాలను, వివిధ ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇలా ఎడ్లను పూజించడం వల్ల వ్యవసాయ క్షేత్రాల్లో ఎలాగైతే వరినాట్లు ఎదుగుతాయో అదే విధంగా తమ సంతానం వృద్ధి చెందుతుందని భావిస్తారు. ఎడ్ల పొలాల అమావాస్య రోజున ఊర్లలో ముస్తాబు చేసిన ఎడ్లను గ్రామం అంతా ఊరేగించడం ప్రత్యేకతగా నిలుస్తుంది. ఎడ్లు లేని వారు మట్టితో తయారు చేసిన ఎడ్లను పూజిస్తారు. శ్రావణమాసం మంగళగౌరీవ్రతం నిర్వహించడంతో పాటు సంతాన ఆయుష్షును అందించే ఎడ్ల పొలాల అమావాస్య రోజు వ్రతాన్ని మహిళలు నిర్వహిస్తారు. ఈ అమావాస్య రోజు పూజించిన ఎడ్లను వినాయక చవితి వరకు ఉంచి ప్రతీరోజూ ప్రత్యేక పూజలు జరుపుతారు.

● మార్కెట్ సందడి

ఎడ్ల పొలాల అమావాస్యను పురస్కరించుకొని ఎడ్లను అలంకరించడానికి కావాల్సిన సామాగ్రి కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారింది. ఉదయం నుండి వర్షం పడుతుండటంతో కొంత అసౌకర్యానికి గురైనప్పటికి వర్షం తగ్గగానే పూజకు కావాల్సిన సామాగ్రిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపారు. ఎడ్లులేని వారు ఇండ్లలో పూజించడానికి కావాల్సిన మట్టి ఎడ్లను కొనుగోలు చేశారు.

● నాళేశ్వర్‌లో ఎడ్ల పొలాల అమావాస్య

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో ఆదివారం సాయంత్రం పొలాల అమావాస్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు తమ ఎద్దులను అందంగా అలంకరించి ముస్తాబు చేశారు.అనంతరం స్థానిక హనుమాన్ మందిరం చుట్టు ప్రదక్షిణ చేయించారు.పాడిపంటలు చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

● ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు

రెంజల్: మండలంలో పొలాల అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాడిపంటలు చల్లగా ఉండేందుకు ప్రకృతి పూజించేలా మండలంలో అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. పశువులను శుభ్రపరిచి పశువులను అలంకరించారు. గ్రామంలో ఉన్న ఆలయం వద్ద ప్రదక్షిణలు నిర్వహించి పండుగను ఘనంగా నిర్వహించారు.

వర్షంలోనూ కొనసాగిన పెన్షన్ విద్రోహ దినం ధర్నా



నగరంలో ధర్నా చేస్తున్న ఉద్యోగ జేఏసీ నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 1: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెన్షన్ విద్రోహదినం వర్షంలోను కొనసాగింది. ఆదివారం ఉద్యోగ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. భారీ వర్షం కురవడంతో ధర్నాని పాత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగులకు ఐటీ సీలింగ్‌పై రూ.10లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. ఓల్డ్‌పెన్షన్ రద్దు అయి కొత్త పెన్షన్ అమలు చేయడంతో ఉద్యోగుల భవిష్యత్తు అందకారంగా మారిందన్నారు. కొంత మంది ఉద్యోగులు మరణించినప్పటికీ సరైన విధివిధానాలు లేనందున ఎటువంటి పెన్షన్ రాక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. సీపీఎస్ అంతమయ్యే వరకు పోరాటం ఆగదని పాతపెన్షన్ విధానం అమలయ్యే వరకు ఉద్యమిస్తామన్నారు.త్వరలో కమిటీని వేసి ఉద్యమకార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో టిజివో అధ్యక్ష, కార్యదర్శులు అమృత్‌కుమార్, హన్మంత్‌రెడ్డి, ప్రశాంత్, వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, సత్యనారాయణ, పండరినాథ్, భోజాగౌడ్, శాంతన్, అన్వర్, స్వామిదాస్, పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

కోటగిరి,సెప్టెంబర్1: భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు పెద్ద ఎత్తున ప్రబలే అవకాశం ఉందని, వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్న వారికి ఈ నెల 30వ తేదీ వరకు ఈకేవైసీ ఆధార్ అనుసంధానం చేసుకోకపోతే రేషన్ కార్డులు రద్దు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. రేషన్‌కార్డులు కలిగి ఉండేది కూలీలు, కార్మికులేనని వారంత ఇతర ప్రాంతాలకు వలసపోయి జీవిస్తున్నారన్నారు. ఈకేవైసీ ఆధార్ అనుసంధానానికి సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల పెరుగుతున్న నిత్యావసర ధరలు తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దుబాస్ రాములు, విఠల్ గౌడ్, నల్ల గంగాధర్, సునీల్ కుమార్, సాయిలు, నగేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఆన్‌లైన్ వ్యాపారంతో ప్రజలకు కుచ్చుటోపీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 1: ఆన్‌లైన్ పెట్టుబడి పెట్టి లాభాలను గడించ వచ్చని ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మోసాలకు పాల్పడ్డ ముఠాను నిర్మల్ పోలీసులు గుట్టురట్టు చేసి నిందితులను పట్టుకున్నారు. ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గంగాధర్ నిందితుడిలో ఒకరు. క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ పేరుతో ఆన్‌లైన్‌లో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలోని పలువురిని పెట్టుబడిని పెట్టిస్తూ అధిక లాభాలు పొందవచ్చని ప్రజలకు దూరాశను కల్పించినట్టు తెలి సింది. దీంతో నిర్మల్‌లో పలువురు బాధితుల ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ చేశారు. అలాగే నిజామాబాద్ జిల్లాలోని బిట్‌కాయిన్ బాధితుల వివరాలను సేకరిస్తున్నట్టు తెలిసింది.

● ఆరు నెలల్లో ప్రమోషన్ ఉండగా అరెస్టు

ఆర్మూర్‌లో ఎక్సైజ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై గంగాధర్ ఆరు నెలల్లో ప్రమోషన్ ఉండగా అరెస్టు కావడంతో పోలీసు అధికారులు అవక్కాయ్యారు. 2005 బ్యాచ్‌లో ఎక్సైజ్ ఎస్సైగా పోస్టింగ్ రావల్సిన ఆయనకు ఎంపీడీవోగా పోస్టుఇచ్చారు. అనంతరం డీపీవోగా విధులు నిర్వహించిన ఆయన రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టు తీర్పుతో ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సైగా విధులను చేపట్టారు. ఎన్నోఉన్నత పదవులు అధిరోహిస్తారనుకుంటే ఆత్యాశకు పోయి అధిక లాభాలు గడించవచ్చని కటకటలపాలు కావడంతో పోలీసులు నివ్వెరపోయారు.

నిర్మల్,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్త కొత్త టెక్నాలజీతో ప్రజలకు ఆశ చూపించి మోసాలు చేస్తున్న ముఠాను ఆదివారం నిర్మల్ పోలీసులు అరెస్టు చేశారు. కష్టం లేకుండా డబ్బులు సంపాదించాలన్న దురాశతో కొంత మంది ముఠాగా ఏర్పడి ప్రభుత్వ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే వారితో పాటు మధ్య తరగతి వారిని బురిడీ కొట్టించి ఆన్‌లైన్ కాయిన్ వ్యాపారం పేరుతో మోసం చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. నిర్మల్ జిల్లాలో కడెం నుంచి ప్రారంభించి అన్ని ప్రాంతాల ప్రజలను మోసాలు చేయడమే వీరు పనిగా పెట్టుకున్నారు. ప్రజల నుంచి పోలీసులకు అందిన సమాచారం మేరకు 'నిర్మల్ పోలీస్-మీ పోలీస్' కార్యక్రమంలో భాగంగా ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిల సవాలుగా తీసుకున్నారు. అదనపు ఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. పోలీసు బృందాలు ఈ కేసులో నిర్మల్ ప్రాంతంలో ఈ వ్యాపారాన్ని విస్తరించడంలో కీలకంగా వ్యవహరించిన కడెం మండలం నవాబుపేట గ్రామానికి చెందిన సల్ల రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఈ వ్యాపారానికి సంబంధించిన వివరాలు వెల్లడించడంతో పోలీసులు మరికొందరిని అరెస్టు చేశారు. ఈ కేసులో సాయి కిరణ్‌తో పాటు కడెం మండలం గంగాపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కండెల నరేష్, ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, ఏఆర్ కానిస్టేబుల్ మహేష్‌లను అరెస్టు చేశారు. సల్ల రాజ్‌కుమార్ చెప్పి వివరాల ప్రకారం.. బిట్ కాయిన్స్ ఆన్‌లైన్ వ్యాపా రంలో పెట్టుబడి పెట్టండి... మీకు డాలర్ల రూపంలో వస్తాయి. లేకుం టే మాది పూచీకత్తు అంటూ... 500ల రోజులలో (ఏడాదిన్నర) 5 ను ంచి 10 రెట్లు పెంచుకునే అవకాశం ఉందని అమాయకులను నమ్మి స్తూ వ్యాపారంలోకి దింపారు. కనీస కొనుగోలు :50 డాలర్లు (5,000),గరిష్ట కొనుగోలు :10,000 డాలర్లు (10 లక్షలు), నాన్ వర్కింగ్ ఇన్కమ్ : స్టేకింగ్ బోనస్ రోజుకు 0.5 శాతం అంటే నెలకు 15 శాతం (500 రోజులు), వర్కింగ్ ఇన్కమ్ : రిఫరల్ బోనస్ 1 శాతం - 100 శాతం, లెవెల్ బోనస్ 1 - 50 లెవెల్స్, లీడర్ షిప్ బోనస్: 1 స్టార్ - 7 స్టార్ 10 సీఈఆర్, ఇది కంపెనీ కాదు. ఉద్యోగం కాదు. వ్యాపారం కాదు. పెట్టుబడి కాదు. మీరు ఎంత మందిని జాయిన్ చేయిస్తే మీకు అంత లాభాలు వస్తాయని భారీ ఆశలు చూపించి వారందరిని మభ్యపెట్టి ఈ వ్యాపారంలో చాలా మంది ఉద్యోగస్తుల్ని చిన్న, మధ్య తరగతి వారిచే పెట్టుబడి పెట్టించి మోసం చేస్తున్నారని ఎస్పీ వెల్లడించారు. కాగా ఈ వ్యాపారానికి ఎటువంటి గుర్తింపు లేదని, బాధితులపై ఈ పథకం ప్రభావం తీవ్రంగా ఉందని ఆమె చెప్పారు. అమాయకుల నుంచి వసూలు చేసిన సొమ్ము దుర్వినియోగం అవుతోందని అక్రమార్కులు చేసిన తప్పుడు వాగ్దానాలను నమ్మి అమాయకులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇలాంటి వ్యాపారంలో ముందుగా జాయిన్ అయిన వారికి మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఈ వ్యాపారం రూపొందించబడిందని వీరు మొదటగా ఒకరిని జాయిన్ చేయించిన తర్వాత ఇంకొకరితో ఒత్తిడి తీసువచ్చి మళ్లీ కొత్త వారిని జాయిన్ చేయిస్తారని తెలిపారు. ఇలాంటి వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దని, ఇలాంటి వారు మళ్లీ ఎవరైనా వస్తే మాకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఏఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, నిర్మల్ రూరల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సైలు సాయికృష్ణ, ఎం. రవి, రవీందర్, కానిస్టేబుల్ తిరుపతి, గణేష్, శౌకత్, సతీష్‌లను ఎస్పీ ప్రశంసించారు.

కాలనీలో పిచ్చిమొక్కల తొలగింపు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్1: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలో వేపుగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగింపజేశారు. ప్రతీ ఆదివారం 2గంటల పాటు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీవాసులు స్వచ్ఛ కాలనీ సమాఖ్యకాలనీలో భాగంగా పెరిగిన పిచ్చిమొక్కలను, చెత్తచెదారాన్ని తొలగింపజేశారు. అలాగే మురికికాల్వలో ఉన్న చెత్తను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్, కొక్కెర భూమన్న, ఎల్‌టి.కుమార్, గడ్డం శంకర్, ఎర్ర భూమయ్య, సాయన్న, గణేష్, సతీస్, జీవన్, తదితరులు పాల్గొన్నారు..

కాశీవిశ్వనాథ ఆలయం లో ప్రత్యేక పూజలు

డిచ్‌పల్లి,సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, రుద్రహోమం, సాయంత్రం అమృతాభిషేకం, కల్యాణం, పల్లకి సేవ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసద వితరన చేశారు.

క్రీడా పోటీలు వాయిదా

ముప్కాల్, సెప్టెంబర్1.: నేటి నుంచి జరగాల్సిన ఉమ్మడి బాల్కొండ మండల అంతర్ పాఠశాల క్రీడా పోటీలు భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. మళ్ళీ తదుపరి తేదీ ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్1: కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్ అన్నారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్ళాలని ఆమె సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివాసించే వారు మున్సిపల్‌లో ఏర్పాటు కంట్రోల్ రూంలో సమాచారం అందించాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్ళలో ప్రజలు నివాసించవద్దని ఆమె తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు మున్సిపల్ పరిధిలో పర్యటించాలని సూచించారు.

'చంద్రబాబు అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచారు'

బోధన్‌రూరల్,సెప్టెంబర్1: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిసారిగా సమాఖ్య ఆంధ్రలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 29సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బోధన్ పట్టణంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజల అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. ప్రస్తుతం 4వ పర్యాయం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి సమకాలీన రాజకీయాలలో భారతదేశ రాజకీయ గమనికపై గుర్తింపు పొందారన్నారు. తన విశిష్టమైన పరిజ్ఞానం, నేర్పుతో దేశ రాజకీయాలలో తనదైన ముద్ర వేశారన్నారు. భారత దేశ అభివృద్ధిలో తన పాత్ర వహించాలని కోరారు.

నాగిరెడ్డిపేటలో కూలిన చెట్టు


ప్రధాన రహదారిపై కూలిన చెట్టు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 1 : భారీ వర్షాలు కురుస్తున్నందున నాగిరెడ్డిపేట మండల కేంద్రం వద్ద ఆదివారం సాయంత్రం హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారిపైన భారీ మర్రిచెట్టు కూలిపోయింది. దీంతో సుమారు గంట వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్టురోడ్డుపైనే కూలిపోవడంతో ఇరువైపులా వాహనాలు, చెట్టు తొలగించే వరకు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌జామ్ అయింది. ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ పోచారం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ చెట్టు రోడ్డు పైన కూలి పోయి, ట్రాఫిక్ జామ్‌కావడంతో ఆయన వెంటనే స్పందించి జాతీ యరహదారి పనులు చేస్తున్న వారికి సమాచారమిచ్చి, హిటాచీ, జేసీ బీలను రప్పించి వెంటనే రోడ్డుపై అడ్డంగా ఉన్న చెట్టును తొలగిం పజేశారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రావు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 1 : నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా పని చేసిన లక్ష్మణ్ అవినీతి, అక్రమాలకు పాల్పడగా, అతన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విచారణ జరిపి గురువారం సస్పెన్షన్ చేశారు. ఆయన స్థానంలో ఎల్లారెడ్డిలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావుకు నాగిరెడ్డిపేట ఫుల్ ఇంచార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించడంతో ఆయన బాధ్యతలను చేపట్టారు.

ఎగువ మానేరులో మత్స్యకారుడి గల్లంతు


సంఘటనాస్థలానికి వచ్చిన ఎస్పీ, గల్లంతైన శివరాములు (ఫైల్)

మాచారెడ్డి, సెప్టెంబరు 1 : మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామ శివారులో గల ఎగువమానేరు ప్రాజెక్టులో గ్రామానికి చెందిన కైరం కొండ శివరాములు (55) అనే మత్సకారుడు గల్లంతైనట్లు ఎస్సై అనిల్ తెలిపారు. శివరాములు ఆదివారం ఉదయం మానేరు ప్రా జెక్టులో చేపలు పట్టేందుకు వెళ్లగా వరద ఉధృతికి నీటిలో మునిగి కనిపించకుండాపోయాడు. అతడు ఉపయోగించిన తెప్ప, వల ఒడ్డుకు చేరుకోవడంతో కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఎస్సై అనిల్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ విషయాన్ని ఎస్పీ సింధూ శర్మకు తెలిపారు. దీంతో ఆదివారం సాయంత్రం ఎస్పీ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత సహాయ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

ఎన్‌ఎస్‌యుఐ యువకుల ఆర్థిక సహాయం

భీమ్‌గల్, సెప్టెంబర్ 1 : భీమ్‌గల్ పట్టణానికి చెందిన జుబేదా అనే మహిళ గత రెండేళ్లుగా చెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో ఆదివారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు రూ.5,500 ఆర్థిక సహాయం అందజేశారు.. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితురాలు చికిత్స కోసం ఎన్‌ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రహమాన్, బోజారాజు, పుప్పాల విశాల్, సుంకరి సురేష్‌లు తక్షణ సహయంగా రూ.5500 ఆర్థిక సహయం అందజేశారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

బాన్సువాడ, సెప్టెంబరు 1 : పెళ్లిని నిరాకరించినందుకు నర్సును హత్య చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడ పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కృష్ణ మాట్లాడుతూ బాన్సువాడ పట్టణంలోని 7 హిల్స్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న మమతను నీరుడి ప్రశాంత్ అద్దెకు ఉంటున్న ఇంట్లో తమ కూతురు హత్యకు ప్రశాంత్ కారణమని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, మమత మూడేళ్ళుగా ప్రశాంత్ ప్రేమలో ఉందని ఆయన తెలిపారు. పెళ్ళి విషయంలో వీరి మధ్య తరచూ గొడవలు జరిగాయని, మా అమ్మ ఐదు రోజులు సెలవు పెట్టి రమ్మని ఒత్తిడి చేస్తుందని మమత చెప్పిందని విచారణలో ప్రశాంత్ తెలిపినట్లు సీఐ వెల్లడించారు. ప్రశాంత్ తన తల్లితో ప్రేమ విషయం చెప్పాడని మన కంటే వారిది ఎక్కువ కులమని, పెళ్ళి చేసుకుంటే మనను బతకనివ్వరు అని కుమారునితో తల్లి చెప్పినట్లు ఆయన తెలిపారు. దీంతో ప్రశాంత్ మమతకు తన చెల్లి పెళ్లి చేశాక మా తల్లిని ఒప్పించి పెళ్ళి చేసుకుందామని అప్పటి వరకు ఆగుదామని మమతకు చెప్పినట్లు తెలిపారు. ప్రశాంత్ వారి అమ్మ పెళ్ళికి ఒప్పుకోదని మమత మరింత ఒత్తిడి చేయడంతో మమతను ఎలాగైనా తప్పించాలని గత నెల 30న అద్దెకు ఇంట్లో ఉన్న మమత ఇంటికి వెనుక డోర్ నుంచి వెళ్లి చున్నీతో ఉరి వేసి హత్య చేసినట్లు ప్రశాంత్ ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ప్రశాంత్ తన స్నేహితునికి కాల్ చేసి డాక్టర్‌ను తీసుకురమ్మని చెప్పడంతో స్నేహితుడు డాక్టర్ కోసం వెళ్లిన ఎవరూ రాకపోవడంతో ఇద్దరు కలిసి మమతను బయటకు తీసుకు వస్తున్న సమయంలో ఇంటి యజమాని చూసి ఏమైంది అని అడుగుతాడు. సొమ్మసిల్లి పడిపోయిందని ఆసుపత్రికి తీసుకుని వెళుతున్నామని చెప్పడంతో ముగ్గురు కలిసి ఆసుపత్రికి తీసుకుని వెళ్లినట్లు సీఐ తెలిపారు. అప్పటికే మృతి చెందింది అని వైద్యులు తెలపడంతో మమత బంధువులకు ప్రశాంత్ ఫోన్ చేసి ఉరి వేసుకుని మమత చనిపోయిందని తెలిపి ప్రశాంత్ అక్కడి నుంచి పారిపోవడం జరిగిందన్నారు. ప్రశాంత్‌పై హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ళు తదితరులు ఉన్నారు.

'వేతనాలు రాక కుటుంబపోషణ భారం'

బోధన్‌రూరల్,సెప్టెంబరు 1: పెగడాపల్లి గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో ఎండీ.జమాలుద్దీన్ అనే వ్యక్తి అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా వేతనాలు రావడం లేదని కుటుంబ పోషణ భారంగా మారిందని ఆదివారం విలేకరుల ముందు తన గోడును వెల్లబోసుకున్నాడు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న నిధులు మంజూరు కాకపోవడం వల్ల తనకు వేతనం రావడం లేదని చెబుతున్నారని ఆయన ఆరోపించారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తనకు రావాల్సిన రెండు సంవత్సరాల వేతన బకాయిలు చెల్లించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

ఎడపల్లిలో చెరువులను పరిశీలించిన అధికారులు.

ఎడపల్లి, సెప్టెంబర్01: శనివారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో ఉన్న చెరువులను ఆదివారం ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రైల్ ఎఫెక్టెడ్ ట్యాంక్ చెరువులు పెద్ద చెరువు, అడి చెరువులలో నీరు రైల్ పట్టాలకు చేరువగా ఉన్నాయా అని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న చెరువులలో నీరు రైల్ ఎఫెక్టెడ్‌కు చేరువగా లేవని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్, మండల పరిషత్ అధికారి మన్ మోహన్ శర్మ, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌కుమార్

వేల్పూర్, సెప్టెంబర్1: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు బుల్లెట్ రమేష్ వారి అన్న ఇటీవల అనారోగ్యంతో మర ణించారు. ఈ విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ ముత్యాల సునీల్‌కుమార్ ఆదివారం వారి ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్, గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి'

బోధన్‌రూరల్,సెప్టెంబర్1: బోధన్ నియోజకవర్గంలో ప్రజలు గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్‌లో ఎంపీఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న గణేష్ ఉత్సవాలను హిందు బంధువులు, యువత నియమ నిష్టాలతో ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. శాంతియుతంగా హిందు బంధువులు గణేష్ పండుగను భక్తిశ్రద్ధల మధ్య నడుపుకోవాలన్నారు. గణేష్ మండపాలకు తనవంతు సహయ, సహకారాలు అందిస్తామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కోటగిరి,సెప్టెంబర్1: కోటగిరి ఉమ్మడి మండలంలోని ఐదుగురు లబ్ధిదారులకు ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. పొతంగల్ గ్రామానికి చెందిన చంద్రకళ, అన్సరి బేగం, సుమలత, హంగర్గ ఫారంకు చెందిన కరీస్మా, దిలీప్‌లకు సీఎంఆర్‌ఎఫ్ కింద 3లక్షల రూపాయల చెక్కులు మంజూరు కాగా తన నివాసంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు శంకర్ పటేల్, హెగ్డోలి శంకర్, నాయకులు ఏజాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

'బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 1 : బోదన్ డివిజన్‌లో అక్బర్‌నగర్‌లో గల అగ్రికల్చర్ పాల్‌టెక్నిక్ కళాశాలలో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థిని రక్షిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని పీడీఎస్‌యు డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ అన్నారు. ఆదివారం పట్టణంలో పీడీఎస్‌యు కార్యాలయంలో ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాటాడుతూ శనివారం కళాశాలలోని హాస్టల్, బాత్‌రూంలో విద్యార్థిని రక్షిత మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అదే రోజు సీసీ కెమెరాలు పని చేయకపోవడం, కుటుంబసభ్యులు రాక ముందే మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించడం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థిని మృతి వెనుకల ఎవరు ఉన్న ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, విద్యార్థిని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు వెంకటేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో జాగ్రత్తగా ఉండాలి

మెండోర, సెప్టెంబర్1: రాబోయే రెండు, మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎస్సై నారాయణ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా మండల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని, లోతట్టు ప్రాంతాల్లో ఉంటే ప్రజలకు కావల్సిన ఏర్పాట్లను సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

కమ్మర్‌పల్లి ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు1: కమ్మర్‌పల్లి మండల ఆర్యవైశ్య సంఘం నూతన పాలకవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా దొంతుల రమణయ్యగుప్త, ఉపాధ్యక్షుడుగా బెజగం వెంకటేష్‌గుప్త, కార్యదర్శిగా జొన్నల భూషన్ గుప్త, కోశాధికారిగా కటకం భాస్కర్ గుప్త, సలహాదారులుగా సీనియర్ సభ్యులు చిటికేశి గంగాధర్, మర్యాల నాగభూషణం, అమెడ నరేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిండిన చెరువులు, పొంగిన వాగులు



కామారెడ్డి గాంధీనగర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



వాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



కామారెడ్డి-బాన్సువాడ రహదారిపై పారుతున్న వరద నీరు



బీర్కూర్‌లో తాత్కాలిక పునరావాస కేంద్రం



లెండివాగును పరిశీలిస్తున్న తహసీల్దార్



అలుగు పారుతున్న కోనాపూర్ చెరువు



కామారెడ్డి హనుమాన్ కాలనీలో...

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 1 : శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి ఆదివారం సాయంత్రం నుంచి పొంగిపొర్లుతుంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.5 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా శనివారం ఉదయం వరకు ప్రాజెక్టులో కేవలం 15 అడుగుల నీరు మాత్రమే నిలువ ఉండగా, శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిపోయింది.

రాజంపేట : మండలంలో ఎడతెరపులేని వానతో చెరువులు, కుంటలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండాపూర్ నుంచి మెదక్ జిల్లాకు వెళ్లె ప్రధానరహదారి కుంగిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టారు. రాజంపేట నుంచి శివాయిపల్లి వెళ్లే మార్గమధ్యలో ఆర్యల్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్తుల సహకారంతో రాకపోకలు నిలిపివేశారు.

తాడ్వాయి : మండలంలోని సంతాయిపేట భీమేశ్వర ఆలయ వాగు ఆలయ సమీపానికి అనుకుని ఉధృతంగాప్రవహిస్తుంది. కన్కల్ గ్రామంలోని ఈదులవాగు పారడంతో రాకపోకలు బంద్ చేశారు. ప్రజలు ఇండ్లలోంచి బయటకు రావద్దని మండల అధికారి సయ్యద్ సాజిద్ తెలిపారు.

సదాశివనగర్ : అమర్లబండవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఇరుగ్రామాలప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం అమర్లబండ వాగు ఉధృతిని పరిశీలించారు. అత్యవసర సమయం అయితే గ్రామపంచాయతీ సిబ్బందికి సమాచారం అందించి బయటకు రావాలని తెలిపారు.

గాంధారి : మండలంలో కురుస్తున్న భారీవర్షాలకు పలుచోట్ల రాకపోకలను నిలిపివేశారు. మండలంలోని ముదెళ్లివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కామారెడ్డి, బాన్సువాడకు రాకపోకలు నిలిచిపోయాయి. బూర్గుల్ వాగుపై వరద ఉధృతి ఉండడంతో గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు.

బీర్కూర్ : అధికారులు మండలంలో ఆదివారం పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. బీర్కూర్, కిస్టాపూర్ గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాలల్లో బాధితుల కోసం పున రావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నిజాంసాగర్ : ఉభయ జిల్లాల రైతాంగానికి కల్పతరమైన నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి శనివారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులో క్రమేపాన నీటి సామర్థ్యం పెరుగుతూనే ఉంది. పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతూ ఉండటంతో ఆ ప్రాజెక్టు ద్వారా 20 వేల క్యూసెక్కుల నీరు మంజీరా ద్వారా నిజాంసాగర్‌లోనికి వస్తుంది. మరో నాలుగు వేల క్యూసెకుల నీరు వాగులు, వంకల ద్వారా వస్తుంది.

మద్నూర్ : మూడురోజుల పాటు భారీ వర్షాలు ఉండటం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ ఆయా గ్రామాలలో పర్యటించి ప్రజలకు సూచనలు, సలహాలు అందజేశారు. పాత భవనాలలో పాత ఇండ్లలో మట్టి ఇండ్లలో నివసించరాదని సూచించారు.

బాన్సువాడ : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. బాన్సువాడ నుంచి నిజామాబాద్ వెళ్లే రహదారిపై అంకుల్ క్యాంప్ వద్ద బ్రిడ్జి మునిగిపోవడంతో రాకపోకలు నిలిచాయి. కోనాపూర్ హనుమాజీ పేట్, సంగోజీపేట్ గ్రామాల్లో భారీ వర్షానికి భారీ నీరు చేరడంతో మొక్క జొన్న పంట నీట మునిగింది. కొన్ని చోట్ల ఇండ్లు కూలి ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది.

ఎల్లారెడ్డి : మండలంలోని తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డి తండా గ్రామాలకు వెళ్లే రోడ్డు కళ్యాణి వాగుపై బ్రిడ్జి ఉండటంతో నిన్నటి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఉధృతితో ప్రవహిస్తుంది. ఆ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉందని పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. వాగువద్ద రోడ్డుపై వాహనాలను వెళ్లకుండా ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ చర్యలు తీసుకున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ కట్టు కింది తండా సురాయి చెరువు అలుగును తహసీల్దార్ మహేందర్‌కుమార్, ఎంపీవో ప్రకాష్‌లు పరిశీలించారు. ప్రజలు వాటి వైపు వెళ్లకుండా రెండు వైపులా కంచెలు ఏర్పాటు చేయించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కామారెడ్డిటౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి నుంచి కుండపోత వర్షం కురిసింది. అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. సిరిసిల్లరోడ్డు, రామారెడ్డి రోడ్డు, నిజాంసాగర్ రోడ్డులు చెరువులను తలపించాయి. మోకాలు లోతు వరకు వరద ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిరిసిల్లరోడ్డులోని గాంధీనగర్, వాసవి నగర్, టీచర్స్ కాలనీలు పూర్తిగా జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి.

నసురుల్లాబాద్ : మండలంలోని ఆయా గ్రామాలలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భారీ వర్షపాతం నమోదైంది. కాగా ఆదివారం అధికారులు గ్రామాలకు చేరుకుని గ్రామస్తులకు, ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో నాగరాజు మాట్లాడుతూ భారీ వర్షం నేపథ్యం కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎల్లారెడ్డి : శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి వరద ఉధృతితో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎల్లారెడ్డి మున్సిపా లిటీ లోని లోతట్టు ప్రాంతాలలో ఉన్న నివాసాల వద్ద వర్షపు నీరు భారీగా నుంచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని వాగులు వంకలు పొంగిపొర్లాయి.

భిక్కనూరు : మండలంలోని అంతంపల్లి, భిక్కనూరు మధ్యలో ఉన్న ఎడ్లకట్ట వాగు రోడ్డుపై పారడంతో రోడ్డుపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. మండలంలోని పెద్దమల్లారెడ్డి, మల్లుపల్లి గ్రామాల వద్ద వాగు ఉత్పతంగా ప్రహించడంతో గ్రామపంచాయతీ ఈవో లక్ష్మీ అధికారుల ఆదేశాల మేరకు రెండు గ్రామాల మధ్య రాకపోకలను నిలిపివేశారు. మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరస్వామి ఆలయానికి వెళ్లె దారిలో ఎల్లమ్మ ఆలయం వద్ద బీటీరోడ్డు నీటిప్రవాహానికి కొట్టుకుపోయి రోడ్డు ధ్వంసమైంది. భిక్కనూరు మండలకేంద్రంలోని బొబ్బిలి చెరువు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు 36సంవత్సరాల తర్వాత అలుగు పారుతుంది.

మద్నూర్ : డోంగ్లి మండలంలోని లింబూరు గ్రామం నుంచి వాడి గ్రామానికి వెళ్లే దారిలో వాగులు పొంగి పొర్లడంతో ప్రజలు వాడి గ్రామానికి వెళ్లరాదని, తహసీల్దార్ రేణుక చౌహన్ ప్రజలకు తెలిపారు.

పెద్దకొడప్‌గల్ : గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జుక్కల్ ఎంపిడివో శ్రీనివాస్ సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జుక్కల్ మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపిడివో ప్రజలు పురాతన ఇండ్లలో ఉండరాదని, వరద ప్రవాహం ఉన్న ప్రాంతాలలో ఉండరాదని సూచించారు. జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ప్రారంభం అయింది. వర్షాకాలం ప్రారంభం అయి సుమారు మూడు నెలలకు పైగా అయినప్పటికి ఒక రోజు మాత్రమే కొంత ఇన్‌ఫ్లో వచ్చి ఆగిపోయాయి. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు అంతోఇంతో ఇన్‌ఫ్లో వచ్చినప్పటికి కౌలాస్ ప్రాజెక్టుకు మాత్రం ఇన్‌ఫ్లో రాలేదు. అయితే రెండు రోజుల నుండి ప్రాజెక్ట్ పై భాగంలో భారీ వర్షాలు కురియడంతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ప్రారంభం అయింది. రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు భారీ వరద నీరు రావడంతో మండలంలోని పోచారం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

దోమకొండ : లింగుపల్లి గ్రామంలో చెట్టు రోడ్డుపై పడిపోవడంతో కామారెడ్డి, దోమకొండకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దోమకొండ మండలంలో గొట్టిముక్కుల, చింతమాన్‌పల్లి, ముత్యంపేట గ్రామాల్లో వాగులు పొంగిపొర్లడంతో ఎస్సై అంజనేయులు ఆధ్వర్యంలో, బీబీపేట మండలంలో ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు రోడ్లను ట్యాంకర్లు, ట్రాలీలు, ట్రాక్టర్‌లను అడ్డుపెట్టి మూసివేశారు.



కామారెడ్డిలో వరద నీటిలో చిక్కుకున్న కారు



బొమ్మదేవ్‌పల్లిలో ఇళ్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో



ఎల్లారెడ్డిలో జలమయమైన రోడ్డు



రామేశ్వర్‌పల్లిలో చిక్కుకున్న స్థానికులు



సురాయి చెరువు అలుగును పరిశీలిస్తున్న తహసీల్దార్



కళ్యాణి వాగు భారీ ప్రవాహంతో ఆగిన రవాణా



కొండాపూర్‌లో నూతన బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు



జుక్కల్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో



ఎల్లారెడ్డిలో కూలిన ఇల్లు



భిక్కనూరు ఎల్లమ్మ ఆలయం వద్ద బ్రిడ్జి కింద నిండిన నీరు



డోంగ్లి మండలంలో అడ్డుగా పెట్టిన ట్రాక్టర్



బీర్కూర్‌లో డబుల్ బెడ్‌రూమ్‌లు స్వాధీనం చేసుకుంటున్న లబ్ధిదారులు

బీర్కూర్‌లో డబుల్‌బెడ్ రూమ్‌ల స్వాధీనం

బీర్కూర్, సెప్టెంబరు 1 : గత ప్రభుత్వ హయాంలో బీర్కూర్ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్‌లను ఆదివారం పేదలు స్వాధీనం చేసుకున్నారు. డబుల్‌బెడ్ రూమ్‌లు నిర్మించి నెలలు గడుస్తున్నా అధికారులు ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. దీంతో విసిగి వేసారిన పేదలు ఆదివారం పెద్దసంఖ్యలో డబుల్ బెడ్ రూమ్‌ల వద్దకు చేరుకున్నారు. డబుల్‌బెడ్ రూమ్‌లోకి చొచ్చుకుపోయి ఎవరికి వారు స్వాధీనం చేసుకుని తాళాలు వేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీర్కూర్‌లో వందకుపైగా డబుల్‌బెడ్ రూమ్‌లను నిర్మించి పేదలకు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా మళ్లీ 36 డబుల్ బెడ్‌రూమ్‌లను కొత్తగా నిర్మించి పంపిణీ చేయలేదు. రేపు, మాపు అంటూ అధికారులు కాలం వెల్లదీశారు. రోజులు గడుస్తున్నా అధికారులు ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో పేదలు కోపోద్రిక్తులయ్యారు. వందలాది మంది డబుల్‌బెడ్ రూమ్‌ల వద్దకు చేరుకునిలోనికి ప్రవేశించారు.

బదిలీపై వెళ్తున్న వ్యవసాయాధికారికి సన్మానం

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 1 : జుక్కల్ మండల వ్యవసాయాధికారిగా పనిచేసిన నవీన్ బదిలీపై నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా జుక్కల్ ఏవోగా పనిచేస్తున్న నవీన్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాకు వెళ్లారు. దీంతో ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు నవీన్‌కు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు రమేష్ దేశాయ్ మాట్లాడుతు నవీన్ మండల రైతులకు అందుబాటులో ఉండి మంచి సేవలు అందించారని గుర్తుచేశారు.

నేడు ప్రజావాణి రద్దు, విద్యాసంస్థల బంద్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 1: జిల్లాలో భారీ వర్షాలు కురు స్తున్నందున కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం చేపట్టే ప్రజావాణిని రద్దు చేసినట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి రావద్దని సూచించారు. జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు వద్దనే ఉద్దేశంతో సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్సి విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు ఈ ఆదేశాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 1 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎస్పీ సింధూశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పోచారం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు రావడంతో నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, మహ్మద్‌నగర్‌మండల ప్రజలు,ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగాఉండాలని సూచించారు. అత్యవసరమైతే డయల్ 100 లేదా 8712686133 ఫోన్‌చేసి పోలీసుల సేవలు పొందాలని తెలిపారు.

విద్యుత్ డీఈగా విజయ్ సారథి

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 1 : ఎల్లారెడ్డి డివిజన్ విద్యుత్ శాఖ డీఈగా విజయ సారథి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆదిలాబాద్ జిల్లాలో ఏడీగా పని చేసి పదోన్నతిపై ఎల్లారెడ్డి వచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సమస్యలు రాకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు

సదాశివనగర్,సెప్టెంబరు 1:మండలంలోని పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు వద్ద ఒక గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదానికి గురైనట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. గాయాలపాలైన అతనిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేనందున గుర్తించలేక పోయామని తెలిపారు. ఆయనకు సంబంధించిన వారు ఎవరైన ఉంటే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

సదాశివనగర్, సెప్టెంబరు 1:రైతులకు సేవచేసే అవకాశం కల్పించినందుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని మార్కెట్ కమిటి నూతనచైర్మన్ సంగ్యా అన్నారు.ఆదివారం ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి అసెంబ్లీ యువనాయకుడుసంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగిన నిరసన

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 1 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సెప్టెంబర్ 1పెన్షన్ విద్రోహదినంగా పేర్కొంటూ తెలంగాణ ఎంప్లాయిస్ గెజిటెడ్ ఆఫీసర్, ఉపాధ్యాయ పెన్షనర్ల కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో వర్షంలోనూ ఆదివారం నిరసన తెలిపారు. నల్లగొడుగులు, నల్లటి దుస్తులతో ప్లకార్డులు పట్టుకుని సీపీఎస్ వద్దని ఓపీఎస్ కావాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రకటించిన యూపీఎస్ పెన్షన్ విధానం కూడా ఆమోదయోగ్యం కాదని ఓపీఎస్‌కు ప్రత్యామ్నయం ఏది లేదని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ఓపీఎస్‌ను అమలుచేయాలని అన్నారు. కార్యక్రమంలో టీఈజీజేఏసీ స్టీరింగ్ కమిటి సభ్యులు వెంకట్ రెడ్డి,సాయిలు, సాయిరెడ్డి, దామోదర్‌రెడ్డి, కుంట ఎల్లారెడ్డి, సీహెచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఏడోవార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ప్రశాంత్

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 1 : ఎల్లారెడ్డి పట్టణంలోని ఏడో వార్డు కాం గ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ప్రశాంత్‌ను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు నియమించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు.

వినాయక మండపాలకు లడ్డూల పంపిణీ

కామారెడ్డిటౌన్,సెప్టెంబరు 1:కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసే వినాయక మండపాలకు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి లడ్డు ప్రసాదాన్ని పంపిణీచేయనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి తెలిపారు.ఆదివారం లడ్డు ప్రసాద తయారికై పూజ కార్యక్రమం నిర్వహించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	సరిపోదా శనివారం
దర్శన్	కమిటి కుర్రాళ్లు
ప్రియా 70	ఆయ్
ప్రియా 35	ఆహో విక్రమార్క

బాన్సువాడ	
మహేశ్వరి	సరిపోదా శనివారం
వెంకటేశ్వర	తంగలాన్

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190